
చందానగర్‌లో దుర్గామాత మండపంలో.. ఎమ్మెల్యే గాంధీ, నిర్వాహకులు, భక్తులు


ఖాజాగూడ.. ముత్యాలమ్మ ఆలయంలో కుంకుమార్చన


పాపిరెడ్డి కాలనీ ఆరంభ టౌన్‌షిప్‌లో.. దుర్గామాత సన్నిధిలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్


ఊరపోచమ్మ ఆలయంలో..


రాయదుర్గంలో.. లలితా త్రిపురసుందరిగా ఊరపోచమ్మ


జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లో..


గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..


ఖాజాగూడ సాయిఐశ్వర్యకాలనీలో ముత్యాలమ్మకు ప్రత్యేక అలంకారం

శాకంబరిగా దుర్గాదేవి

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆలయాల్లో, వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. రాయదుర్గంలో దుర్గాదేవి అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. మహిళా భక్తులు అమ్మవారికి 120కి పైగా ప్రసాదాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక హారతులు ఇచ్చారు. సామూహిక కుంకుమార్చనలు, లక్ష్మీ సహస్రనామ పారాయణం చేశారు. పలు ప్రాంతాల్లో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.
– గచ్చిబౌలి/రాయదుర్గం


రాయదుర్గంలో.. దుర్గామాతకు 120కి పైగా ప్రసాదాలను సమర్పించిన భక్తులు


రాయదుర్గంలో..

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చందానగర్: మాదాపూర్ డివిజన్ పరిధిలో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో రూ.73 లక్షలు, ఇజ్జత్‌నగర్‌లో రూ.69 లక్షలు, హైటెక్ ఫుడ్ కోర్ట్ నుంచి యశోద హాస్పటల్ వరకు.. అలాగే భారత్ పెట్రోల్ పంప్ నుంచి హైటెక్ సిటీ ఫ్లైఓవర్ వరకు రూ.2.62 కోట్లు, గోకుల్ ప్లాట్స్‌లో రూ.93 లక్షలతో సీసీ రోడ్డు, రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టనున్నామని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

సీఎంఆర్‌ఎఫ్ మంజూరుపత్రం అందజేత



రాయదుర్గం: సీఎం రేవంత్‌రెడ్డి పేదల పక్షపాతి అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. రాయదుర్గంకు చెందిన మీర్ ఆసిఫ్ అలీఖాన్ అత్యవసర చికిత్స కోసం సీఎంఆర్‌ఎఫ్‌కి దరఖాస్తు చేసుకోగా లక్ష రూపాయల మంజూరు పత్రాలను ఆదివారం అందించారు. కార్యక్రమంలో గణపతి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో 'నేచర్‌వాక్'



రాయదుర్గం: హెచ్‌సీయూ విద్యార్థులు ఆదివారం క్యాంపస్‌లో 'టెంపుల్‌రాక్స్' పేరిట నేచర్ వాక్ నిర్వహించారు. దేశంలో విభిన్న ప్రాంతాలకు చెందిన విద్యార్థుల నడుమ స్నేహభావం పెంపొందించేందుకు ఎక్స్‌ప్లోరర్స్ ఆధ్వర్యంలో నేచర్‌వాక్, లేక్‌వాక్, రాక్ క్లైంబింగ్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

శిల్పారామంలో దసరా ఉత్సవాలు





మాదాపూర్: శిల్పారామంలో దసరా, బతుకమ్మ సంబరాలు సందడిగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం టికే సిస్టర్స్ డాక్టర్ సరోజ, డాక్టర్ సుజాతల సంగీత కచేరీ సందర్శకులను అలరించింది. జ్యోత్స్న శిష్యబృందం దేవీ స్తుతి కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులు మనస్వి, తేజస్వి, శరణ్య, అద్వైత, హాసిని, జ్యోతికారెడ్డి అమ్మవారి రూపాలను ప్రదర్శించారు. కాగా చేనేత ఎగ్జిబిషన్‌కు మంచి స్పందన లభిస్తోంది.


చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజితాగౌడ్, భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.
– చందానగర్

నాద బ్రహ్మోత్సవ్



మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో ఆదివారం నాద బ్రహ్మోత్సవ్‌- 2024 నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు సందీప్, స్వరజ ఆలపించిన కీర్తనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విష్ణుఒక్కడే, తందనాన, నారాయణ సగుణ వంటి అన్నమాచార్య కీర్తనలతో అలరించారు. కీబోర్డు మారుతీ కిరణ్, తబలా శ్రీనివాస్ వాద్య సహకారాన్ని అందించారు.

నియోస్కిన్ క్లినిక్ ప్రారంభం



క్లినిక్‌ను ప్రారంభించిన పాండురంగారావు

కూకట్‌పల్లి: మాదాపూర్‌లో నియోస్కిన్ (స్కిన్ కేర్) క్లినిక్‌ను ఆదివారం రాష్ట్ర చలన చిత్ర మండలి కార్యవర్గ సభ్యులు, పట్టభద్రుల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గొట్టిముక్కల పాండురంగారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో సినీ ఆర్టిస్ట్ ప్రభాకర్, రామ్‌నగర్ బన్నీ తదితరులు పాల్గొన్నారు.

కర సేవకుల ర్యాలీ

అల్విన్‌కాలనీ: పాపారాయుడు నగర్‌లోని అశోక గార్డెన్‌లో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పుట్టి 100వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన నేపథ్యంలో కూకట్‌పల్లి బాగ్‌కు చెందిన స్వయం సేవకులు పథ సంచలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూకట్‌పల్లి ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపారాయుడునగర్, పాపిరెడ్డినగర్, ప్రగతినగర్, హనుమాన్ నగర్ తదితర కాలనీల్లో కర సేవకులు ర్యాలీ నిర్వహించారు. పలు కూడళ్లలో వారికి ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అఖిల భారత జనతా పార్టీ నాయకులు మాధవరం కాంతారావు, డాక్టర్ కొరదాల నరేష్, సురభి రవీందర్ రావు, నరేందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, కుమార్ యాదవ్, అక్కినపల్లి సాయి కుమార్, నర్సింగ్‌రావు, భూపాల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాయి పాల్గొన్నారు.


స్వయం సేవకుల పథ సంచలన్ కార్యక్రమంలో పాల్గొన్న కరసేవకులు

నేడు చండీహోమం

పటాన్‌చెరు టౌన్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలో భాగంగా సోమవారం రామలింగేశ్వర దేవస్థానంలో అమ్మవారికి ఒడి బియ్యం సమర్పణ, అన్నదానం, సాయంత్రం 4 గంటలకు చండీ హోమం ఉంటుందని ఆలయ అర్చకులు మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ఎమ్మారై సేవలు అందుబాటులోకి తేవాలి

పటాన్‌చెరు టౌన్: ఈఎస్‌ఐ ఆస్పత్రిలో ఎమ్మారై స్కానింగ్ సేవలు అందుబాటులోకి తేవాలని ఎంపీ సురేష్ షట్కర్‌కు ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రామచంద్రాపురం ఈఎస్‌ఐ ఆసుపత్రిలో ఎమ్మారై స్కానింగ్ లేకపోవడంతో కార్మికులు వారి కుటుంబ సభ్యులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సనత్‌నగర్ ఈఎస్‌ఐ ఆసుపత్రికి సిఫారసు చేస్తున్నారని దీంతో రోజుల తరబడి ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈఎస్‌ఐ డైరెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానన్నారని తెలిపారు.

బాలుడు అదృశ్యం


అదృశ్యమైన బాలుడు లక్కీ

మియాపూర్: బాలుడు అదృశ్యమైన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ దుర్గారామలింగప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ న్యూ కాలనీకి చెందిన మహేష్ కుమారుడు లక్కీ(9)ఈ నెల 2వ తేదీ మెట్రో స్టేషన్ దగ్గర ఆడుకుంటూ తప్పిపోయాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. బాలుడు మూగ, చెవిటి. బాలుడి తండ్రి మహేష్ ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మియాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ దుర్గా రామలింగప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌లోని బొల్లారం క్రాస్ రోడ్డు సమీపంలో ఓ వ్యక్తి పడి ఉన్నాడని శనివారం రాత్రి మియాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. చుట్టుపక్కల ఆరా తీయగా భిక్షాటన చేస్తూ.. చెత్త ఏరుకుంటూ ఇక్కడే తిరుగుతుండేవాడని తెలిపారు. అనారోగ్యంతో మృతి చెంది ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఈ మేరకు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ వ్యక్తిని గుర్తించినట్లయితే మియాపూర్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ముందుకు కదల్లేక.. వెనక్కు వెళ్లలేక..!



- ట్రాఫిక్ దిగ్బంధంలో పెద్దమ్మ గుడి పరిసరాలు
- వాహనదారులు, భక్తులకు తీవ్ర ఇబ్బందులు
- ఉత్సవాలకు ముందు సమన్వయ సమావేశాలు నిల్
- నగర సీపీ చొరవ చూపితేనే సమస్య పరిష్కారం

బంజారాహిల్స్: అధికారుల సమన్వయలోపం కారణంగా పెద్దమ్మతల్లి ఆలయ పరిసరాల్లో ప్రతీ ఆదివారం ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. ఎటూ వెళ్లలేక వాహనదారులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారంలో ఒకరోజు ఈ మార్గం గుండా వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. బల్కంపేట ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవం జరిగినా..మహంకాళి అమ్మవారి బోనాల జాతర సమయంలో ట్రాఫిక్ , లాఅండ్ ఆర్డర్ పోలీసులు, ఆలయ అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయ సమావేశాలను ఏర్పాటు చేసుకుని భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ రూపొందించుకుంటారు. అయితే జూబ్లీహిల్స్ పెద్దమ్మ దేవాలయానికి వచ్చే సరికి వేలాదిగా భక్తులు వస్తున్నారని తెలిసినా పోలీసులు, ఆలయ ఈఓ, జీహెచ్‌ఎంసీ ఏనాడూ సమీక్ష సమావేశాలు నిర్వహించిన దాఖలాలు లేవు. ఫలితంగా పెద్దమ్మ గుడిలో మంగళ, శుక్ర, ఆదివారాలతో పాటు శాకంబరి ఉత్సవాలు, రథోత్సవాలు, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వచ్చాయంటే భక్తుల ఇక్కట్లు అంతా ఇంతా కాదు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దమ్మ తల్లిని దర్శించుకునేందుకు నగరం నలుమూలల నుంచి భక్తులు తెల్లవారుజామున 3 గంటల నుంచే క్యూ కట్టారు. ఉదయం 8 గంటలకు పెద్దమ్మ గుడి ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాలు, ప్రధాన రహదారులు, ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. మధ్యాహ్నం 1 గంట వరకు రోడ్డు నంబర్-36తో పాటు రోడ్డు నంబర్-45, రోడ్డు నంబర్-10, అటు మాదాపూర్ వైపు, ఇటు బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు వైపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. నవరాత్రి మహోత్సవాలకు ముందు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులతో, జూబ్లీహిల్స్ లాఅండ్ ఆర్డర్ పోలీసులతో పెద్దమ్మ గుడి అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించి ఉంటే ఇంత గందరగోళం తలెత్తేది కాదని భక్తులు, వాహనదారులు వాపోతున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల దాకా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఆర్టీసీ ప్రయాణికులు, ఇతర వాహనదారులు ప్రత్యక్ష నరకాన్ని చవిచూశారు. పోలీసు సిబ్బంది సరిపడా లేక అటు లా అండ్ ఆర్డర్ పోలీసులు, ఇటు ట్రాఫిక్ పోలీసులు చేతులెత్తేశారు. నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఈ విషయంలో ప్రత్యేక దృష్టిపెట్టి గుడి నిర్వాహకులతో పండగల సందర్భంలో సమన్వయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆదివారం వచ్చిందంటే ఇక్కడి రహదారులన్నీ నరకప్రాయంగా మారుతున్నాయి. ముందుకు, వెనుకకు కదల్లేని స్థితిలో వాహనదారులు నరకం చూస్తున్నారు. పండగ దృష్ట్యా వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

గుర్రపుడెక్క .. మురుగు

కాలుష్యకాసారాలుగా మియాపూర్ చెరువులు


మియాపూర్‌లోని గురునాథం చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క

మియాపూర్: మియాపూర్‌లో చెరువులు గుర్రపుడెక్క, మురుగునీటితో నిండిపోయాయి. కాలుష్య కాసారాలుగా మారాయి. చెరువులు మురుగుమయంగా మారడంతో దోమలు ప్రబలాయి. దీనికి తోడు ఆయా ప్రాంతాల్లో చెత్త వేస్తుండడంతో అపరిశుభ్రంగా తయారయ్యాయి. దీంతో చుట్టుపక్కల కాలనీవాసులు ఇబ్బందిపడుతున్నారు.

- మియాపూర్ డివిజన్ పరిధిలో నాయినమ్మకుంట, రామసముద్రం కుంట, మక్త చెరువు, బీకే ఎన్‌క్లేవ్ వద్ద మీదికుంట చెరువు, పటేల్ చెరువు, గురునాథం చెరువులున్నాయి.
- పటేల్ చెరువు రూ.12 కోట్లతో, నాయిమ్మకుంట చెరువు రూ.1.25 కోట్లు ,మీదికుంట చెరువు, మక్త చెరువులకు రూ.2.13కోట్లు, రామసముద్రం చెరువు అభివృద్ధికి రూ.కోటి నిధులు కేటాయించారు.
- ఐదు సంవత్సరాల కిందట సుందరీకరణ పనులు చేపట్టగా ఇప్పటి వరకు చెరువు చుట్టు కట్ట ఏర్పాటు చేశారు. మురుగును మళ్లించేందుకు కొంతమేర పైపులైన్ వేసి వదిలేశారు. చెరువుల్లో ఉన్న గుర్రపుడెక్క, పూడిక, చెత్త చెదారాన్ని తొలగించలేదు.
- చెరువులను పట్టించుకోకపోవడంతో గుర్రపుడెక్క పెరిగి, దోమలు, క్రిమికీటకాలకు ఆవాసాలుగా మారాయి. చెరువులను శుభ్రం చేసేందుకు ప్రతియేటా కోట్ల రూపాయల నిధులు మంజూరవుతున్నా గత మూడేళ్లుగా శుభ్రం చేసే పనులు చేపట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- ఈ ఏడాది కూడా పటేల్, గురునాథం, నాయినమ్మ కుంట చెరువు, మీదికుంట చెరువులోని గుర్రపుడెక్క తొలగింపునకు ప్రజాప్రతినిధులు, అధికారులు పనులను ప్రారంభించారు. పనులు పూర్తిస్థాయిలో చేపట్టక పోవడంతో చెరువులన్నీ గుర్రపుడెక్క, మురుగునీటితో దర్శనమిస్తున్నాయి.
- దుర్గంధం, దోమల బెడదతో అనారోగ్యం పాలవుతున్నామని చెరువు చుట్టుపక్కల ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మియాపూర్‌లోని చెరువులను మళ్లీ సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి సుందరీకరణ పనులు చేపట్టాలని, అలాగే హైడ్రా అధికారులు మియాపూర్‌లోని చెరువులను పరిశీలించి కబ్జాలను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


మియాపూర్ పటేల్ చెరువులో..


మియాపూర్ లక్ష్మీనగర్‌లోని నాయినమ్మకుంట చెరువులో..





ముగిసిన వన్యప్రాణి వారోత్సవాలు

గచ్చిబౌలి: వన్యప్రాణి వారోత్సవాలు, పాలపిట్ట పండగలో సందర్శకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వన్యప్రాణి వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. సందర్శకులు ప్రకృతిని, పక్షులను కెమెరాల్లో బంధించారు. సైక్లింగ్ పోటీల్లో పెద్దలతో పాటు చిన్నారులు హుషారుగా పాల్గొన్నారు. పర్యావరణ ప్రాముఖ్యత, పాముల పాత్ర, పాము కాటుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్నేక్ షోలో వివరించారు. కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ ఎకోటూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, ఎఫ్ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

